క్లుప్తంగా

గండ్లూరులో 'కోడ్' అమలులో నిర్లక్ష్యం



సత్తెనపల్లి: ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చి గురువారం నాటికి 13 రోజులు గడుస్తున్నా మండలంలోని గండ్లూరు గ్రామంలో నిర్లక్ష్యం స్పష్టంగా నిపిస్తోంది. గ్రామంలోని వాటర్ ప్లాంటులో ఇప్పటికీ టీడీపీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఫొటో, స్టిక్కర్లు అతికించి స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో ఎన్నికల కోడ్ సక్రమంగా అమలయ్యేలా చూడాలని ప్రజల కోరుతున్నారు.

క్షతగాత్రుడికి మంత్రి పరామర్శ



సత్తెనపల్లి: వరిగడ్డి దగ్ధం ఘటనలో గాయపడిన ముప్పాళ్ల మండలం మాదల గ్రామానికి చెందిన దొండపాటి యువరాజుకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు వైద్యులను కోరారు. పట్టణంలోని సంజనా వైద్యశాలలో చికిత్స పొందుతున్న అతనిని గురువారం ఆయన పరామర్శించారు. క్షతగాత్రుడి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైద్యులు డాక్టర్ జి.శ్రీధర్‌తో మాట్లాడారు. మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఇటీవల ట్రాక్టర్‌పై ఎండు గడ్డి తీసుకు వస్తుండగా ఫణిదం గ్రామంలో విద్యుత్ తీగలు తగిలి గడ్డి, ట్రాక్టరు దగ్ధమైన ఘటనలో డ్రైవర్ యువరాజు కూడా మంటల్లో చిక్కుకొని తీవ్రంగా గాయపడ్డాడు. మాదల నాయకుడు సైదా మంత్రితో ఉన్నారు.

ఇద్దరు వలంటీర్ల తొలగింపు

సత్తెనపల్లి: ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధంగా రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొన్నారన్న ఆరోపణలపై 14వ సచివాలయం పరిధిలోని 11వ వార్డుకు చెందిన వేల్పుల అఖిల్, దర్శి కిరణ్‌కుమార్‌ను విధుల నుంచి తొలగిస్తూ మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సమాచారాన్ని నియోజకవర్గ ఆర్‌ఓ, సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన కలెక్టర్ శివశంకర్‌కు నివేదిక పంపారు.

బలుసుపాడులో జ్వరాల సర్వే




పెదకూరపాడు: మండలంలోని బలుసుపాడులో డెంగ్యూ లక్షణాలతో కడియాల పావని మృతి చెందినట్లు వార్త కథనాలు ప్రచురితం కావడంతో.. గురువారం జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నకర్ ఆధ్వర్యంలో జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా 75 త్యాళ్లూరు వైద్యాధికారి వెలుగొండరెడ్డి మాట్లాడారు. పావని మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తో మృతి చెందినట్లు తెలిపారు. గ్రామంలో దోమల మందు పిచికారి చేయించారు. మలేరియా అధికారి రవీంద్ర రత్నకర్ వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో జ్వరాలు లేవని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ విజయ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు దాసరి దిలీప్‌కుమార్, శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవతామూర్తుల ప్రతిష్ఠోత్సవంలో..

అనంతవరం(క్రోసూరు): అనంతవరం గ్రామంలో జీర్ణోద్ధరణ పూర్తయిన దేవతామూర్తుల రావి గురునాథ స్వామి, ప్రసన్నాంజనేయస్వామి, పోలేరమ్మ తల్లి, అంకమ్మ, గంగమ్మ తల్లి, పోతురాజు స్వామి విగ్రహ, జీవధ్వజ ప్రతిష్టా మహోత్సవంలో గురువారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొన్నారు. స్వామి వార్ల ఆశీస్సులతో నియోజకవర్గంలో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో ఉండాలని మొక్కుకున్నారు.

పాముకాటుతో రైతు మృతి



ఈపూరు: వరిపైరులో పురుగుమందు పిచికారీ చేస్తుండగా వ్యక్తి పాము కాటుకు గురై మృతి చెందాడు. మండలంలోని బొగ్గరం గ్రామానికి చెందిన రైతు పసుపులేటి ఏడుకొండలు (41) తన కుమారుడితో కలిసి వరి పొలంలో పురుగుల మందు పిచికారీ చేస్తుండగా పాము కాటు వేయడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుమారుడు కేకలు వేయడంతో సమీప పొలాల్లోని వారు వచ్చి ఏడుకొండలును ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లే లోపే మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఏడుకొండలుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

- 3న ముస్లిం సోదరులకు భారీ ఇఫ్తార్ విందు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లిలో ముస్లింలతో కలిసి ఈద్గా స్థల పరిశీలన



సత్తెనపల్లిలో ఈద్గా స్థలాన్ని పరిశీలించి, సూచనలు చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ప్రజల మధ్య సోదర భావం, మత సామరస్యాన్ని పరిమళింజేస్తుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లిలోని మాచర్ల రోడ్డులో గల ఈద్గా స్థలంలో ఏప్రిల్ 3న భారీ స్థాయిలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తున్న క్రమంలో గురువారం ఆయన ఈద్గా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడారు. సత్ప్రవర్తనతో నడవడానికి రంజాన్ ఉప వాసం ఉపకరిస్తుందన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ దైవం అనుసరించిన మార్గంలో నడవాలని పేర్కొన్నారు. ఇఫ్తార్ విందుకు హాజరయ్యే ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. వాహనాలు పార్కింగ్ తదితర ఏర్పాట్లపై వాటిపై సూచనలు చేశారు. ఆయనతోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్ మీరాన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ నాగుల్ బాష, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ షేక్ కరీం, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



ఇన్నమ్మ



కోడెల రామారావు



యామర్తి మస్తాన్



పఠాన్ ఇసూబ్ ఖాన్

పెదకూరపాడు: మండల వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.మహిళా విభాగం అధ్యక్షురాలిగా పాటిబండ్ల గ్రామానికి చెందిన ఇన్నమ్మ, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా అదే గ్రామానికి చెందిన పఠాన్ ఇసూబ్ ఖాన్, బీసీ సెల్ అధ్యక్షుడిగా కంభంపాడుకు చెందిన యామార్తి మస్తాన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా లగడపాడుకు చెందిన కోడెల రామారావు నియమితులయ్యారు. వీరంతా వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. ఆయా విభాగాల్లో పార్టీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని వారు తెలిపారు. తమపై నమ్మకంతో పదవులు ఇచ్చిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, పార్టీ మండల కన్వీనర్ షేక్ మస్తాన్‌షరీఫ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా రవి విజయం



పాటిబండ్ల రవి



తాళ్లూరి రాజావిజయభరత్

సత్తెనపల్లి: బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా పాటిబండ్ల రవి విజయం సాధించారు. గురువారం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్ష, జాయింట్ సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ మెంబరు జూనియర్ పదవులకు ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్ష పదవికి బాణావత్ అమరయ్య నాయక్, పాటిబండ్ల రవి నామినేషన్‌లు దాఖలు చేశారు. అయితే.. ఎన్నికల వ్యవహారమంతా ఏకపక్షంగా జరుగుతుందన్న ఆరోపణతో బాణావత్ అమరయ్య నాయక్ ఎన్నికల నుంచి తప్పుకుంటున్నట్లు ముందు రోజు ప్రకటించారు. అయినప్పటికీ ప్యానల్‌లో ఉండటం వల్ల ఎన్నిక అనివార్యమైంది. మొత్తం 105 ఓట్లు పోలు కాగా పాటిబండ్ల రవికి 87, ఎన్నికల బరి నుంచి తప్పుకున్న బాణావత్ అమరయ్య నాయక్‌కు 16 ఓట్లు వచ్చాయి. రెండు ఓట్లు చెల్లలేదు. 71 ఓట్ల మెజారీతో పాటిబండ్ల రవి విజయం సాధించారు. జాయింట్ సెక్రటరీ పదవికి కాశిమాల మార్క్, బయ్యవరపు నరసింహారావు, ఎం.ఏడుకొండలు మధ్య పోటీ జరగాల్సి ఉండగా కాశిమాల మార్క్ బరి నుంచి తప్పుకోవడంతో నరసింహారావు, ఏడుకొండలు పోటీపడ్డారు. 105 ఓట్లు పోలయ్యాయి. చెరో 49 ఓట్లు రాగా ప్యానల్‌లో ఉండటం వల్ల కాశిమాల్ మార్క్‌కు మూడు ఓట్లు రాగా నాలుగు ఓట్లు చెల్లలేదు. ఇద్దరికీ సమానంగా ఓట్లు రావడంతో ఎన్నిక టై అయ్యింది. దీనిపై బార్ కౌన్సిల్ సూచన మేరకు నిర్ణయం తీసుకోనున్నట్లు ప్రకటించారు. ఎగ్జిక్యూటివ్ మెంబరు జూనియర్ పదవికి ఉడుముల విద్యాసాగర్ రెడ్డి, తాళ్లూరి రాజా విజయభరత్, తవ్వా హరనాథ్ పోటీ పడాల్సి ఉండగా విద్యాసాగర్‌రెడ్డి ముందుగా బరి నుంచి తప్పుకున్నారు. మొత్తం 105 ఓట్లు పోలు కాగా తాళ్లూరి రాజా విజయభరత్‌కు 56 ఓట్లు, తవ్వా హరనాథ్‌కు 45 ఓట్లు, ప్యానల్‌లో ఉన్న విద్యాసాగర్ రెడ్డికి ఒక్క ఓటు వచ్చింది. మూడు ఓట్లు చెల్ల లేదు. తాళ్లూరి రాజా విజయభరత్ 11 ఓట్లు మెజార్టీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారి సయ్యద్ అబ్దుల్ రహీం తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



లక్కరాజుగార్లపాడులో కవాతు

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాజేష్ కుమార్ హెచ్చరించారు. లక్కరాజుగార్లపాడు, పాకాలపాడు గ్రామాల్లో సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ (కవాతు) గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాజేష్ కుమార్ మాట్లాడారు. ఓటర్లు నిర్భయంగా ఓటు వేయడానికి రక్షణ కల్పిస్తామన్నారు. ఎలాంటి చిన్న ఘటనలు జరిగినా చర్యలు తప్పవని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సత్తెనపల్లి రూరల్ పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు ఉన్నాయి.

ఎండ్రాయిలో పోలీసు కవాతు

అమరావతి: మండల పరిధిలోని నరుకుళ్ళపాడు, ఎండ్రాయి గ్రామాల్లో గురువారం ఎన్నికలు విధులు నిర్వహించే ప్రత్యేక పోలీసు సిబ్బందితో సీఐ ఏవీ బ్రహ్మం పోలీసు కవాతు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కవాతులో ఎస్ఐలు ఉన్నారు.

సుబాబుల్ తోట దగ్ధం

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి సిగరెట్ తాగి పడేయటంతో ఎకరన్నర విస్తీర్ణంలో ఉన్న సుబాబుల్ తోట అగ్నికి ఆహుతైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. నరసరావుపేట ఫైర్ ఆఫీసర్ ఎంవీ సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు, గ్రామానికి చెందిన వజ్జా కృష్ణ వ్యవసాయ పనులు చేసుకుని జీవిస్తుంటాడు. తన కున్న పొలంలో రెండేళ్ల క్రితం సుబాబుల్ తోట వేశాడు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు మద్యం సేవించి సిగరెట్ తాగి తోటలో పడవేశారు. సిగరెట్ ఎండుటాకులపై పడటంతో మంటలు చెలరేగి తోటలోని చెట్లన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. భారీగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపో యాడు. సకాలంలో ఫైర్ సిబ్బంది స్పందించటంతో చుట్టూ ఉన్న తోటలకు ఎలాంటి నష్టం జరగకుండా కాపాడగలిగారు.

31తో పూర్తి కానున్న ప్రవేశ పరీక్ష గడువు

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశం కోరు విద్యార్థులు ప్రవేశ పరీక్షకు ఈ నెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ బి. రవినాయక్ గురువారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్ర భుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తర గతి చదివిన విద్యార్థులు ప్రవేశ పరీక్షకు అర్హులన్నా రు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈవో జఫ్రుల్లా, సీఐ సాంబశివరావు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక నరసరావుపేట రోడ్డులోని గంగినేని కళ్యాణ మండపంలో గీతమ్స్ విద్యాసంస్థల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈవో సయ్యద్ జఫ్రుల్లా, టౌన్ సీఐ సాంబశివరావులు పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు చక్కగా క్రమశిక్షణతో చదువుకోవడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉంటుందనీ, తల్లిదండ్రులు ప్రతి ఒక్క చిన్నారిని పాఠశాలల్లో చేర్పించి నిరక్షరాస్యతను దూరం చేసేవిధంగా పాటుపడాలన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. కార్యక్రమంలో గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లు

నరసరావుపేట: ఆస్తిపన్ను, కుళాయి పన్నులు చెల్లించేందుకు పురపాలకసంఘ కార్యాలయంలో శుక్ర, శని, ఆదివారాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసినట్లు మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 లోగా పన్నులు చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని ఆయన సూచించారు.

15 వరకు ఓటరు దరఖాస్తుకు అవకాశం

ముప్పాళ్ళ: కొత్తగా ఓటు హక్కు పొందేందుకు ఏప్రిల్ 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దారు పి.సింగారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం నూతన ఓటర్లకు మరో అవకాశం కల్పించిందని, 2024 ఏప్రిల్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారంతా ఓటు హక్కు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషిచేయాలి



అచ్చంపేట: మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన శిఖా తిమోతి గురువారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిమోతిని శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌కు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు అండగా ఉండాలని, పెదకూరపాడు నియోజకవర్గంలో అత్యధిక మోజార్టీతో వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

స్వామి వాసుదేవానంద సేవలో..

విప్పర్ల(క్రోసూరు) : విప్పర్ల గ్రామంలోని నిదానంపాటి పత్తిచెట్ల లక్ష్మీ అమ్మవారి దేవస్థానం ఆహ్వానం మేరకు రామ జన్మభూమి క్షేత్ర ట్రస్ట్ సభ్యులు, ఉత్తరాఖండ్ హిమాలయ స్వామి వాసుదేవానంద సరస్వతీజీ మహారాజ్ తీర్థ యాత్రలో భాగంగా విప్పర్లకు హాజరయ్యారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, సతీమణి వసంత కుమారి స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

సత్తెనపల్లి: కోరిన కోర్కెలు తీర్చే..భక్తుల కొంగుబంగారం కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయ 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు నందిగామ గ్రామంలో శుక్ర, శనివారాల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు త్రిపురమల్లు వెంకట దుర్గామల్లేశ్వరరావు గురువారం తెలిపారు. శుక్రవారం సుప్రభాతసేవ, అఖండ స్థాపన, స్వామివారికి పంచామృతాభిషేకం, దశవిధ స్నానాలు, అలంకారం, సహస్రనామ పుష్పార్చన, మహా నివేదన, తీర్థ ప్రసాద వినియోగం జరుగుతాయన్నారు. అలాగే భగవద్గీత సమాజం విష్ణు, లలిత సహస్ర నామ పారాయణం, రాజ్యలక్ష్మి భజన సమాజం, శ్రీ రాజరాజేశ్వరి భజన సమాజం సంకీర్తన ఉంటుందని తెలిపారు. 30న శ్రీ సీతారామాంజనేయ భజన సమాజం సంకీర్తన జరుగుతాయన్నారు. ఉదయం 11 గంటలకు వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులకు అన్నసంతర్పణ, సాయంత్రం స్వామివారి ఊరేగింపు జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



వినుకొండ(నూజెండ్ల): అబ్దుల్ కలామ్ థెరిస్సా సేవా సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని పట్టణ సీఐ సాంబశివరావు ప్రారంభించి మాట్లాడుతూ సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. జన్మనిచ్చే తల్లుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం వల్ల నిరుపేద మహిళలకు ఎంతో ఊరట కలుగుతుందన్నారు. రక్తదానం చేసిన ప్రతిఒక్కరినీ ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఎస్‌కే అబ్దుల్‌రజాక్, సంస్థ వ్యవస్థాపకురా లు చందోలు నాగవాణి, కన్వీనర్ డాక్టర్ రవి, ఎంఎస్ బాబు, తోట హనుమ, వెంకట్రావు, డి.రాజు, అభిషేక్ ప్రిన్స్, సుబ్బు, సుధాకర్, సాగర్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంకరరావు

పెదకూరపాడు: మండలంలోని తమ్మవరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గుడేటి బసవయ్య, జగ్గవరపు భరత్, గుడేటి ఏసురత్నం, నందిగం పెదోడులకు చెందిన కుటుంబ సభ్యులు ఉన్నారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామని ఎమ్మెల్యే శంకరరావు అన్నారు. క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి ఉన్నారు.

ప్రతి మహిళా అండగా నిలివాలి..

పెదకూరపాడు నియోజకవర్గంలో గతంలో ఏన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమం అందినట్లు స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి నంబూరు వసంత కుమారి పేర్కొన్నారు. గురువారం పెదకూరపాడులో ఇంటింటి ప్రచారం గురువారం నిర్వహించారు. నాగేంద్రస్వామి ఆలయం నుంచి కచేరి సెంటర్ మీదగా దామచర్ల పాలెంలో ప్రచారం కొనసాగింది. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమం ప్రతి ఇంటికి వివరించారు. ప్రతి మహిళా వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, పార్టీ మండల కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్



గ్రంథి నాగలక్ష్మిని అభినందిస్తున్న ఎమ్మెల్యే నంబూరు

అచ్చంపేట: వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలిగా ఎంపికైన గ్రంథి నాగలక్ష్మిని గురువారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అభినందించారు. మండల మహిళా అధ్యక్షురాలిగా మరింత బాధ్యతతో వ్యవహరించాలని వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, సొసైటీ మాజీ అధ్యక్షుడు రామిశెట్టి చిన్న యలమందయ్య, షేక్ సైదా, అచ్చంపేట మాజీ సర్పంచ్ కంబాల వీరబాబు పాల్గొన్నారు.

'బీఎస్ఎన్ఎల్' ఆస్తి పన్నుపై రూ.30లక్షల వడ్డీ రాయితీ



బీఎస్ఎన్ఎల్ అధికారులకు రశీదు అందజేస్తున్న కమిషనర్ కొలిమి షమ్మి

సత్తెనపల్లి: పుర ప్రజలు ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ పిలుపునిచ్చారు. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయ భవనం ఆస్తి పన్ను బకాయిని అధికారులు గురువారం చెల్లించి, రశీదు పొందారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఒకేసారి పన్ను బకాయి చెల్లింపుతో వడ్డీ రాయితీ పొందాలన్నారు. పట్టణ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు ఎన్నో ఏళ్లుగా ఆస్తి పన్ను చెల్లించపోవడంతో మొండి బకాయిలు పేరుకుపోయాయన్నారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించి, పన్ను వసూలుకు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయ భవనానికి 2010 నుంచి ఆస్తి పన్ను చెల్లించలేదన్నారు. మొత్తం రూ. 54,13,393లు బకాయి ఉందన్నారు. దీనిపై వడ్డీ రాయితీ రుసుం రూ.30,99,570 పోగా మిగిలిన రూ. 23,13,823లు నగదు చెల్లించినట్లు చెప్పారు. ఇలా ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ సద్వినియోగం చేసుకోవడం వల్ల పట్టణ అభివృద్ధికి మేలు జరుగుతుందన్నారు. పట్టణ ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. మున్సిపల్ ఆర్వో అప్పారావు, ఆర్ఐ. జానీ బాష, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

పాఠశాలకు రూ.1.25లక్షల వాటర్ ప్లాంట్ విరాళం



ప్లాంటును ప్రారంభిస్తున్న శ్రీనివాసమూర్తి

అచ్చంపేట: స్థానిక శ్రీ తుమ్మేపల్లి శ్రీరాములు జెడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాసమూర్తి రూ.1.25 లక్షల విలువ చేసే ఆర్వో వాటర్ ప్లాంటు విరాళమిచ్చారు. గురువారం ప్లాంటును ప్రారంభించి, విద్యార్థులకు తాగునీటిని అందజేశారు. 1,200 మంది విద్యార్థులు విద్యనభ్యసించే పాఠశాలలో బోరు ఉన్నప్పటికీ ఉప్పునీరు రావడంతో వాటిని తాగలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ నుంచి మంచి నీటి కొళాయి కనెక్షన్ తీసుకుని ఆర్వో ప్లాంటుకు అమర్చి శుద్ధ నీటిని విద్యార్థులకు అందించే ఏర్పాట్లు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయని చిగురుపాటి కల్యాణి, పూర్వ విద్యార్థుల సంఘ కార్యదర్శి పసుపులేటి పాపిరెడ్డి, సభ్యులు సురే సంపత్, కిషోర్, మల్లికార్జునరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీల నాయకులు ప్రచారానికి 48 గంటల ముందుగానే సువిధ యాప్‌లో అనుమతులు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో కొత్తగా ఏర్పాటు చేసే పార్టీ కార్యాలయాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎన్నికల సంఘం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయన్నారు. 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందని, అయితే దానికి ముందస్తుగా 12డీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులంతా ఎన్నికల ప్రచారం నిమిత్తం ఉపయోగించే వాహనాలకు అనుమతులు ఏ విధంగా తీసుకోవాలో వివరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతి నిధుల సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ, సత్తెనపల్లి, నకరికల్లు తహసీల్దార్లు సీహెచ్ ఉష, ఎల్.లక్ష్మీనారాయణ, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ బోస్‌బాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వార్డుల్లో ఫాగింగ్ డ్రైవ్



నరసరావుపేట: పురపాలక పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక ఫాగింగ్ డ్రైవ్ చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సమకూర్చుకున్న అధునాతన ఫాగింగ్ మిషన్లను గురువారం ప్రారంభించారు. ఒక మెగా ఫాగింగ్ మిషన్, ఆరు హ్యాండ్ ఫాగింగ్ మిషన్లు సహాయంతో పట్టణంలో ప్రతి రెండు, మూడు రోజులకు ఒకసారి 34 వార్డుల్లో పూర్తిస్థాయిలో ఫాగింగ్ చేయటం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఒక షెడ్యూల్ ఏర్పాటు చేయాలని సంబంధిత శానిటేషన్ అధికారులను ఆదేశించామన్నారు. మున్సిపల్ ఇంజినీర్ కనకరావు, మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ ఒలేటి శ్రీనివాసరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా బైబిల్ క్లాసులకు సంప్రదించండి

నరసరావుపేట: గూగుల్ మీట్ (ఆన్‌లైన్) ద్వారా బైబిల్ క్లాసులు నిర్వహించి సర్టిఫికెట్ అందజేయటం జరుగుతుందని క్రైస్తవ సంఘాల ఆదరణ సంక్షేమ సమితి అధ్యక్షులు కె.అశోక్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ప్రతిరోజు సాయంత్రం 7.30 నుంచి 9గంటలవరకు ఆన్‌లైన్ క్లాసులు జరుగుతాయన్నారు. వీటికి హాజరైన అభ్యర్థులకు బెంగుళూరుకు చెందిన నేషనల్ అసోసియేషన్ ఫర్ థియాలాజికల్ అక్రిడిటేషన్ (నాటా) ద్వారా సర్టిఫికేట్ అందజేయటం జరుగుతుందన్నారు. రొంపిచర్ల మండలంలోని మునుమాక గ్రామంలో బ్రాంచ్ కార్యాలయం ఉందని, ఆసక్తిగలవారు కార్యాలయం , 97000 10017, 88865 21001 నంబర్లకు సంప్రదించాలని సంక్షేమ సమితి అధ్యక్షులు కె.అశోక్‌కుమార్ తెలిపారు.